



వ్యంగ్య పద చిత్రం

# మద్యపానం జిందాబాద్

సి.వి. రాజగోపాలరావు

"మద్యపానం జిందాబాద్!"

"నీ కేమైనా మతిపోయిందా?"

"తప్పుకో. మద్యపానానికే కాదు, పెరిగే ధరలకూ జిందాబాద్!"

"అనుమానం లేదు. నీకు పూర్తిగా మతిపోయింది."

"అలాగే అనుకో. ఎవరికి మతిపోయిందో తెలుస్తూనే ఉంది."

"లేకపోతే మద్యపానం జిందాబాద్ ఏమిటి?"

"అలా దోవలోకి రా. దీన్ని గురించి చెప్పాలంటే ఓ గ్రంథం అవుతుంది. మద్యపానం ఎంత గొప్పదంటే..."

"ఆగవయ్యా, బాబూ, ఆగు! దాని గొప్పదనాన్ని గురించి మా పాలేరు కూడా చెప్పగలడు."

"అందుకే మద్యపానం జిందాబాద్!"

"జిందాబాద్ ఏమిటయ్యా, అంతా ముర్దాబాద్ అంటుంటే..."

"అక్కడే ఉంది అసలు కిటుకు."

"ఏమిటో అది?"

"ముర్దాబాద్ అంటే చచ్చిపోవడం, జిందాబాద్ అంటే జయించడం."

"నీ దంతా నెగిటివ్ ఏటిట్యూడ్. ఎడ్డెం అంటే తెడ్డెం అంటావ్."

"మద్యపానం గొప్పదనం ఒక్క ముక్కలో చెప్పాలంటే- జాతిపిత గాంధీజీ సాధించలేని పనిని మద్యపానం సాధించింది."

"అంటే?"

"కళ్లకు కట్టినట్లు కనబడుతూంటే వేరే చెప్పాలా ఏం? గాంధీగారు మద్యపాన నిషేధమో అని మొత్తుకున్నాడు. స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు మద్యపాన నిషేధమో అన్నాయ్. అవు నంటావా?"

"ఔను."

"మరి వాళ్లు ఏమి సాధించారు? నెహ్రూ గారు మొదలైన వా రంతా దీనిని రాజ్యాంగంలో పదిలంగా ఉంచారు. అంతేగా!"

"అంతే. అది అమలు చేయాలనే కదా వారి ఉద్దేశం?"

"కా దనను. కాని ఫలితం ఏమిటి? అమలు చేయగలిగారా?"

"లేదు. దానికి కొంత వ్యవధి కావా లనుకున్నారు."

"పోనీ. స్వాతంత్ర్య పోరాటంలో మద్యపాన నిషేధాన్ని కూడా ఒక భాగం చేశారు కదా- మహాత్మా గాంధీ!"

"చేశారు. విదేశీ వస్తువులను బహిష్కరించినట్లే కల్లు దుకాణాల వద్దా పికెటింగ్‌లు, ధర్నాలు చేశారు."

"కాని ఏమి సాధించారు?"

"బాగుంది. ప్రజలలో పరివర్తన వస్తేగాని ఇలాంటివి అమలు కావు కదా!"

"అందువల్లనే కట్నాల నిషేధం, వ్యభిచార నిరోధక చట్టాల గతే దీనికీ పట్టింది. అందువల్ల మద్య నిషేధాన్ని ఎత్తివేశారు."

"ఇంటి కో సారా బట్టీ తయారైతే చస్తారా?"

"నిజమే! కల్తీ సారా తాగి ఒళ్లు హూనం చేసుకుని చనిపోవడాన్ని భరించలేక ఈ వ్యాపారాన్ని ప్రైవేట్ రంగం నుంచి తప్పించి, ప్రభుత్వమే స్వాధీనం చేసుకొంది. దీనివల్ల ఇప్పుడు ఏటా రు. 800 కోట్ల వరకు ఆదాయం వస్తోంది."

"ఔను. ఈ డ బ్బంతా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నారు కదా!"

"ఎవరి కోసం ఖర్చు చేస్తున్నా రన్నది ప్రశ్న కాదు. ఇంత యంత్రాంగం ఉన్న ప్రభుత్వమే మద్య నిషేధాన్ని అమలు చేయలేకపోయిందని ఒప్పుకుంటావా?"

"నే నేమిటి? ప్రభుత్వాలే ఒప్పుకున్నాయి!"

"ఈ ప్రభుత్వాలు చేయలేని పనిని మద్యపానం చేయగలిగింది. ధరలు పెరిగిపోయాయి. సంపాదన చాలక, భార్యల సంపాదన కోసం వారిని చావకొడుతున్నారు; పిల్లలను పోషించుకోలేని స్థితి ఏర్పడింది. హరిజన వాడలోని స్త్రీలు నలుగురూ ఒక చోట చేరి ఆలోచించుకున్నారు. అంతే- ఆ మరునాడు విప్లవం ప్రారంభమైంది."

"ఇదంతా అందరికీ తెలిసిందే!"

"అయినా మరొక ముక్క చెప్పాలి. నాయకుల అవసరం లేకపోయింది. అంతా స్త్రీలే. ఎవరికి వారు వీధులలోకి వచ్చి సారా దుకాణాల్లోని సారా

పాకెట్లను పారవేశారు. ఎక్కడో నెల్లూరు జిల్లాలోని దూబగుంట గ్రామంలో వచ్చిన ఈ విప్లవం నెమ్మదిగా ఇతర జిల్లాలకు పాకి, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తం అయింది. ఇంత విప్లవం రావడానికి కారణం ఎవ రంటావు?"

"మద్యపానం!"

"అందుకే మద్యపానం జిందాబాద్!"

"ఒప్పుకుంటాను."

"నీవు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా అంతే. అందుకే పెరిగే ధరలకు కూడా జేజేలు కొట్టడం."

"అయితే సరే!"

"ఇక్కడ ఇంకో విషయం ఉంది. స్త్రీలంతా పోరాటం చేస్తూంటే, ఇంత కాలం ఏమీ పట్టనట్లు ఉన్న పార్టీలన్నీ ఒక్కసారిగా మద్య నిషేధం కావాలన్నాయి."

"మరి కాంగ్రెస్ వారు కూడా చేయవచ్చు కదా! పైగా ప్రభుత్వం కూడా వారిదే. మద్య నిషేధాన్ని అమలు చేస్తే పోలేదా!"

"అక్కడే పొరబడుతున్నావు. నీవు చెప్పినట్లు మద్య నిషేధాన్ని అమలు చేస్తే విప్లవం నీరు కారిపోదూ?"

"పోతేనేం- ఫలితం వస్తుంది కదా!"

"మళ్లీ పప్పులో కాలు వేస్తున్నావు. ఉద్యమం రాష్ట్రంలోనే కాక, దేశం అంతా రావాలి. ప్రజల్లో పట్టుదల పెరగాలి, అది శాశ్వతంగా ఉండాలి. మగవాళ్లలోని ఈ బలహీనత నరనరాల్లోంచి పూర్తిగా తుడిచిపెట్టే వరకు ఈ ఉద్యమం సాగాలి. అందుకే మద్య నిషేధాన్ని అప్పుడే అమలు చేయకూడ దనేది."

"అయితే నిషేధాన్ని కోరేవారు పొరపాటు చేస్తున్నా రంటావ్."

"ముమ్మాటికీ. వీరు ఇప్పుడు నిషేధం కావాలంటున్నారే కాని తమ ప్రభుత్వాలు ఉన్నచోట దీనిని అమలు చేశారా?"

"లేకపోతేనేం- ఇప్పుడు కావా లంటున్నారు గదా!"

"అదే రాజకీయం. వీళ్లు మరో విషయం మరచిపోతున్నారు."

"ఏమి టది?"


"ప్రజల్లో- అందులోనూ చదువురాని స్త్రీలలో ఇంత విప్లవం వచ్చినా హింసాయుత పద్ధతుల్లో లేదు కదా! గాంధీగారు ఏ మన్నారు? ఒక చెంపమీద కొడితే మరో చెంప ఇమ్మన్నారు. ఇప్పుడు వీళ్లూ అదే పని చేస్తున్నారు. పోలీసులు లాఠీలతో కొట్టబోతే 'మా మొగుళ్ల కన్నా హీనంగా కొట్టగలరా ఈ పోలీసోళ్లు' అంటున్నారు. ఇంత అహింసాయుతంగా విప్లవం తెచ్చిన కాంగ్రెస్ వాళ్లకు ఆ విప్లవాన్ని ఎప్పుడు ఆపాలో తెలియ దంటావా?"

"అయితే ఇంకా ఎంతకాలం పడుతుం దంటావ్?"

"ఈ విప్లవం సారా దుకాణాలకే పరిమితం కారాదు. బార్‌లకు కూడా విస్తరిల్లాలి. అంతవరకూ ప్రభుత్వం నిద్రపోకూడదు. విషానికి విషమే విరుగుడు, పెరుగుట విరుగుట కొరకే అని మన పెద్దలు ఊరికే అన్నారా?"

"ఓ.కె. మద్యపానం జిందాబాద్!"

"వెరీ గుడ్! మద్యపానానికీ జై!
అధిక ధరలకూ జై!"



## జులుం

మహిళా మండలి సమావేశంలో-

"రోజు రోజుకీ మగవాడి జులుం ఎక్కువైపోతోంది. నిన్నటికి నిన్న - కూరలో ఉ ప్పెక్కువైం దంటూ మా ఆయన ప్లేట్ విసిరి కొట్టారు..." ఝాన్సీ చెబుతోంది.

"తరువాత?" అడిగిం దామె.

"ఆయన్ని హాస్పిటల్‌లో చేర్చారు!" నెమ్మదిగా చెప్పింది ఝాన్సీ.

గొంటు శ్రీనివాస్ [కవిటి]

